నే నేం అపకారంచేసాను ! ఆమె ఎవరు ?' అంటూనే హఠాత్తుగా, రాజేంద్రభుజాలు వదిలేసి రోడ్డుమీదకు పరిగెట్టింది. రాజేంద్ర ఆమెని బలంగా చేతులతో చుట్టేయబోయాడు. ఒక్క విదిలింపుతో ఆమె అతన్ని వెనక్కినెట్టి రోడ్డుమీదకు పరిగెట్టింది.

రాజేంద్ర గాభరాగా స్కూటర్ తీసుకు బయలుదేరాడు.

అతను, సరళ వెనకాతల వెళ్ళటం, కిటికీలోంచి జుత్తు విరబోసికొన్న 'బాజీ' చూస్తూనేవుంది.

*　　*　　*

## "లిల్లీ మామా"

పార్కులోకివచ్చి ఉత్తరపుమూలనున్న బెంచీమీద కూర్చుంటూనే యెదుటి బెంచీమీదికి చూసాడు రాంసింగ్. బెంచీ ఖాళీగా, బిక్కగా సూసింది రాంసింగు వెంపు.

"ప్చ ! ఇవ్వాళా రాలేదు!" అనుకున్నాడు నిర్వేదంగా రాంసింగ్. పార్కు అంతా సందడిగావుంది. పిల్లలు జట్లుజట్లుగా చేరి దాగుడుమూత లాడుకుంటున్నారు. కొత్తగా పెళ్ళయిన జంటలు, పరిమళాలు వెదజల్లుతున్న పూలపందిళ్ళ మాటున స్వప్నావశిష్టులై కూర్చున్నారు. పనీపాటాలేని యువకులు, పార్కు అంతా అలగం తిరుగుతూ, తరుణయువతులు ఒంటిగా వున్నప్పుడల్లా తమ భావకవిత్వాన్ని చదువుతూ, మురుస్తున్నారు.

"ఈ మానవమనస్సు అలవాట్లకి బానిస. లేకపోతే తనెవ్వరు ? అరుణెవ్వరు ? తమిద్దరూ ఒక వూరివాళ్ళా ? ఒకచోట చదువుకున్నారా? ఒకజాతివాళ్ళా? కనీసం ఒక భాషవాళ్ళైనాకాదుకదా! ఆరుమాసాలుగా అరుణవచ్చి ఆపార్కు బెంచీమీద కూర్చొనటం తను చూస్తున్నాడు. మూడు మాసాలుగా తనకీ అరుణకీ మాటలు కలిసాయ్ ! అంతే ! ఈ వారంరోజులనించీ అరుణ వచ్చి ఆ బెంచీమీద కూర్చొనక పోవటం తనకొక వెర్రిగా, గుండెల్లో ఏదో చెప్పలేని, అనిర్వచనీయవ్యధగా వున్నది. ఎంత ఆశ్చర్యం ?' రాంసింగ్ యొక్క లోతైన కళ్ళల్లో తడితడిగా అయ్యింది.

రాంసింగ్ నాలుగు సంవత్సరాలుగా ఆ ఊరి కాలేజీలో యన్. సి. సి. ఆఫీసర్‌గా వుంటున్నాడు. ప్రతీ ఆదివారం 'మాట్నీ'కి హిందీపిక్చర్ చూడటం, ప్రతీరోజూ సాయంకాలం ఆరు మొదలు ఎనిమిదిదాకా పార్కులో వుత్తరపుమూలనున్న సిమెంటుబెంచీమీద కూర్చొని, వచ్చేవాళ్ళనీ, పోయేవాళ్ళనీ చూడటం అతని దినచర్యలో దురాక్రమణచేసిన అలవాట్లు. నాలుగుసంవత్సరాలుగా ఆంధ్రలో నివసిస్తూన్నా, రాంసింగ్‌కి తెలుగు మాట్లాడటం బాగా అలవాటు కాలేదు. జనరల్‌గా అందరితోనూ ఇంగ్లీషే మాట్లాడవలసి రావటంచేత అవ్వొచ్చును. పైగా, సంసారఝంఝాటం లేనివాడు. సంసారం పిల్లాపాపా వున్నవాళ్ళయితే సర్వసాధారణంగా ఇరుగుపొరుగువాళ్ళతో టచ్ ఏర్పడుతుంది. ఆ ఇరుగుపొరుగువారు ఏభాషవాళ్ళయితే, ఇంట్లో కూడ చప్పున

ఆ భాష అలవాటు అవుతుంది. రాంసింగ్ వొంటరివాడవటం నించి ఆ అవకాశం లేకుండగా పోయింది. అతనికి కారియర్ భోజనం తెచ్చిపెట్టే నౌఖరు కూడా వుత్తరహిందూస్థానం వాడవటంనించి, వ్యవహారితంగానైనా తెలుగు మాట్లాడాల్సిన అవసరం లేకుండా పోయింది. తోటివుద్యోగస్తులు 'రాంసింగ్' తో అట్టే కలుపుకోరుతనంగా వుండేవాళ్లుకాదు. 'రాంసింగ్' ఎంత స్నేహితంగా పలకరించి కబుర్లలోకి దింపుదామని ప్రయత్నించినా, వాళ్ళు ముక్తసరిగా సమాధానాలు చెప్పి వూరుకునేవారు. కారణం, రాంసింగ్ బ్రహ్మచారి కావటమే! వాళ్ళంతా పిల్లాపాపలతో బోలెడు సంసారాలు ఈదుతూ వుండేవాళ్ళు. రాంసింగ్ దర్జాగా మోటారుసైకిల్ తీసుకుని, బేఖాతరీగా రోడ్లమ్మట తిరుగుతూ ఖులాసాగా జీవితాన్ని గడిపేయటం, మిగిలినవాళ్ళకి జెలసీ పుట్టించేది, పైగా కొంతమందికి, పెళ్లికిఎదిగినఆడపిల్లలుండేవారు.ఇల్లాంటి బ్రహ్మచారులతో స్నేహితాలుచేస్తే ఇంటికి ఏముప్పు తీసుకవస్తాడో అని ఆ ఆడపిల్లల తండ్రులకి భయంగా వుండేది. ఏతావాతా 'రాంసింగ్‌తో' నేస్తానికి హృదయంతో ఎవ్వరూ సిద్ధపడలేదు. రాంసింగ్‌కి ఆంధ్రులన్నా, ఆంధ్రుల వేషభాషలన్నా ఎంతో మక్కువగా వుండేది. అంచేత సినిమాకి వెళ్లినప్పుడు ఆట మొదలెట్టేదాకా, గేటుకేసి చూస్తూ కూర్చునేవాడు. 'మాట్నీ'లకి సాధారణంగా స్త్రీలు ఎక్కువమంది వస్తూంటారు. రంగురంగుల చీరల్లో లాలిత్యంగా, నిర్మలంగా కనబడే ఆంధ్రా స్త్రీల మోహనత్వం 'రాంసింగ్ హృదయాన్ని పల్లవింప

చేసేది. ఆ స్త్రీలు తనతో మాట్లాడితే బాగుండును అనుకునే వాడు. రాంసింగ్ పచ్చగా, పొడుగ్గా దృఢంగా వుండేవాడు. నల్లని చిక్కనిగడ్డంమీదుగా అతని పచ్చగామెరిసే చంపలు వింతకాంతితో నుండేవి. బొద్దుగా పొట్టిగావున్న అతనిముక్కు జీవితంపట్ల అతను పెంచుకున్న మమకారచిహ్నంగా కనిపించేది. అతని నల్లని పొడుగుపాటి గడ్డాన్ని చూసి, పసిపిల్లలు జడుసుకునేవారు. రాంసింగ్ ఎవ్వరితోనైనా స్నేహం కలుపుకోవాలన్నా, ఆకాంక్ష, అతని హృదయంలోనే నిక్షిప్తధనంలా వుండాల్సి వచ్చింది. అరుణ పరిచయమయ్యేదాకా! ఏమంటే అతను చాలాసార్లు సినిమాలకొచ్చే స్త్రీ జనాన్ని పరిశీలించేవాడు. కొంతమంది స్త్రీలు స్థలాభావంవల్ల అతని ప్రక్కనే కూర్చున్నా భుజంనిండా చెంగు కప్పుకుని కుర్చీలో వొదిగిపోయి, వొణికిపోతూ, సినిమా కూడా సరిగా ఎంజాయ్ చెయ్యలేకపోయేవారు. మరికొంతమంది 'అప్టు డేట్' బేబీలు, చూట్టానికి రింగులు, రెండు జళ్లు 'లిప్‌స్టిక్' వేసుకొచ్చి దర్జాగా ప్రక్కకుర్చీల్లో ధైర్యంగా కూర్చున్నా, కాస్త రాంసింగు 'దేఖ యే మాడమ్'! అని పలకరించబోయేసరికి తోకత్రొక్కిన త్రాచల్లే కస్సుమని లేచి, విసురుగా 'యూ డోన్ట్ నో మానర్స్!' అని కసరేవారు. తాను స్నేహితంగా పలకరించితే వాళ్ళు గండుపిల్లుల్లా ఎందుకని గుర్రుగుర్రుమంటారో అర్థంకాక, రాంసింగు తికమక పడిపోయేవాడు. దానితో, అతను ఆంధ్రావాళ్ళల్లో ఫ్రెండ్లీ నేచర్ వున్నవాళ్లు లేరని నిర్ధారణ చేసుకున్నాడు. ఒక్కొక్కప్పుడు రాంసింగుకి విసుగనిపించేది వొంటరితనం. అప్పుడు ట్రాన్సఫర్ చేయించు

కుందామా అనుకునేవాడు! కాని ఆ వూరి చుట్టుప్రక్కలగల ప్రశాంత ప్రకృతిదృశ్యాలు అతని మనోఫలకంమీద మాయనిముద్ర వేసాయ్. ఇల్లా తనలో తను మల్లాగుల్లాలు పడుతూండగానే, అరుణతో పరిచయమయ్యింది. సరిగ్గా, మూడునెలల క్రితం ఒక ఆదివారం మామూలుగా రాంసింగు మాట్నీకి వెళ్ళాడు. న్యూస్‌రీలు అయిపోయాక, ఇంక పిల్ము మొదలెట్టూండగా, ఆదరాబాదరాగా హాలులోపలికి వచ్చింది. 'లిల్లీ'ని ఎత్తుకుని "అరుణ" మంచి ఎండలోంచి రావటంవల్ల, కళ్ళు చీకట్లు కమ్మాయ్ అరుణకి. ఆ హిందీ పిక్చర్ ఆరోజే రిలీజవటంనించి హాలంతా కిటకిటలాడుతున్నారు జనం. గేటుకీపర్ 'టార్చి' తీసుకుని అరుణకి దారి చూపిస్తూ, సరిగ్గా రాంసింగు ప్రక్కనున్న కుర్చీయే చూపించాడు. అరుణకి. లిల్లీని వొళ్ళో కూర్చోపెట్టుకుని కుదురుగాకూర్చుంది అరుణ. పిక్చర్ ప్రారంభం కావడంతో ఆ పిక్చర్ కొంత అయిపోయిందేమో అన్న దుగ్ధ కలిగింది అరుణకి. ఇరుప్రక్కలా ఆత్రుతగా చూసింది. ఒకవెంపు లంకపొగాకుచుట్ట వెలిగించి కెనెడియన్ ఇంజన్‌లా గుప్పుగుప్పుమని పొగ వదలుతూ కూర్చున్న పల్లెటూరి ఆసామి కనిపించాడు. ఆ పిక్చర్ హిందీపిక్చరవటంనించి, ఆ పిక్చర్ ఎంతవరకు నడిచిందో చెప్పగల పరిజ్ఞానం ఆ ఆసామీకుండదని అరుణకి కచ్చితంగా తెలుసును.

ప్రక్కథియేటర్లో ఏదో తెలుగుఫిల్ము వేస్తున్నారు. దానికి టిక్కట్లు దొరకనివారంతా ఈ హిందీఫిల్ముకి వచ్చారు.

ఆ బాపతు మనిషి ఈ చుట్ట తాలూకు యజమాని అని, అరుణ గ్రహించటానికి అరక్షణం పట్టలేదు. ముందువరసలో ఆడవాళ్ళ చీరలూ, పూవులచెండ్లతో నిండిన జడలూ కనబడ్డాయి. కాని, వాళ్ళు తదేకంగా ఫిల్మ్ చూడటంలో నిమగ్నమయిపోయి, రెండు మూడు సార్లు అరుణ పిల్చినా పలకలేదు సరికదా! పైగా విసుక్కున్నారు కూడా! ప్రక్కకి చూసింది అరుణ. రాంసింగు ఒక ప్రక్క స్క్రీన్ మీద పిక్చర్ ఫాలో అవుతూనే రెండో కంట అరుణ ఆరాటాన్ని గమనిస్తున్నాడు. 'అరుణ చొరవచేసి రాంసింగుని అడిగేసింది.

"పిక్చర్ ఎంతసేపయి బిగినైంది!'

'రాంసింగు'కి అరుణ తననేదో అడుగుతోందని అవగాహన అయింది. కాని అడిగేదేదో మటుకు తెలియలా! 'పిక్చర్' 'బిగిన్' అన్న రెండు ముక్కలు మట్టుకు వినపడ్డాయ్! ఎల్లా చెప్పల్నో జవాబు ఆలోచించేలోపున అరుణ అతని వాలకాన్ని గమనించింది. అతనికి తను తెలుగులో చెప్తే అర్థంకాలేదని గ్రహించింది. అరుణకి హిందీ, ఇంగ్లీషు కూడా బాగా మాట్లాటం వచ్చును. అందుచేత హిందీలో అడిగింది. పిక్చర్ మొదలయి ఎంతసేపు అయ్యిందీ అని ఇన్నాళ్ళకి ఒక తెలుగుస్త్రీ తనతో సంభాషణ కోరటం బ్రహ్మానందమయ్యింది రాంసింగుకి.

"ఖవాలీ నృత్యం ఒకటి అయ్యింది" అన్నాడు. హిందీ పిక్చర్‌లో సాధారణంగా నృత్యాలు పాటలూ, ఎక్కువగా వుంటాయి. కాని, కథ ఏమీ వుండదు. సాధారణంగా అన్ని

'బోయ్ మీట్స్ గర్ల్' థీమ్స్‌తో వుండేవే! సీనరీస్ మట్టుకు అద్భుతంగా వుంటాయ్!

'అరుణ అమ్మయ్యా! అనుకుంది. ఇంటర్వెల్ అయ్యే దాకా లిల్లీ బుద్ధిగానే కూర్చుంది. అందాకా చుట్టూ చీకటి కోణంలా వుండి ఒక్క తెరమీదనే వెలుగ్గా వుంటంనించి, లిల్లీ తనచుట్టుప్రక్కల ఎవరెవరున్నారో చూడలేదు. ఇంటర్వెల్‌లో ఒక్కసారిగా. హాలులోని తలుపులన్నీ తీయగానే లిల్లీ తనతలని ఇటూ అటూ త్రిప్పి చూసింది. ఒకప్రక్క తల పాగా చుట్టుకున్న పెద్దమనిషి కన్పించాడు. పళ్ళు అమ్మకునే అబ్బికాబోలున్న అనుకుంది. ఇంకోప్రక్క చూసింది. తనవెంపే చూస్తున్న రాంసింగు కన్పించాడు, "అమ్మయ్యో! ఆ గడ్డం అదీ తప్పక బూచాడే అయ్యుంటాడు!" అనుకుంది. ఆ భావన ఆ పసిమనస్సులోనికి రాగానే కెవ్వుమని కేకవేసి రాగాలాపన చేసింది. అరుణకి లిల్లీ ఎందుకు అకస్మాత్తుగా ఏడుస్తోందో అర్థంకాలేదు. ఆదుర్దాగా,

"ఏమమ్మా! ఏమమ్మా!" అని సముదాయించింది. అరుణ సముదాయించినకొద్దీ లిల్లీరాగాలు శృతిని హెచ్చిస్తున్నాయి. ముందు వెనుక వరసల్లోనున్న వాళ్ళు విసుక్కోవటం మొదలెట్టున్నారు. అరుణ కేంచేయాలో తోచటంలేదు. మళ్లీ షో మొదలయింది. లిల్లీ రాగాలు మట్టుకు మానలేదు. 'రాంసింగు' చూస్తో వూరుకోలేకపోయాడు.

'షీ వజ్ యఫ్రైడ్ ఆఫ్ మీ' అన్నాడు.

"కాదు, కాదు!" అంది అరుణ.

‘బయటకు తీసుకెళ్ళవమ్మా! ఉక్కపోతకి కాబోలును! పిల్ల ఏడుపు మానటంలేదు.’ అన్నది ఎవరో వెనుక వరసలో కూర్చున్నావిడ.

“అసలు చంటిపిల్లల్ని తీసుకరావటం ఎందుకనో వాళ్ళు చూస్తారా, పెట్టారా? పెద్దాళ్ళకి న్యూసెన్స్ క్రియేట్ చెయ్యటం కాని!’ ఒక సలహాసంఘసభ్యురాలు ముందువరసలోంచి, తన ‘వ్యూ’ని ‘ఎక్స్ప్రెస్’ చేసింది. చేసేదిలేక అరుణ లిల్లీని ఎత్తుకుని బయటకు వచ్చేసింది. రాంసింగుకి బాధ కలిగింది. తననించి ఆపిల్లది భయపడి వుంటుందన్నది నగ్నసత్యం. ఆ పిల్లరాగాలు వింటానికే డబ్బుపోసి టిక్కెట్లు కొనుక్కుని పిలుమ్కి వస్తారనుకోవటం సత్యదూరం! చటుక్కున రాంసింగు లేచి, తను కూడా హాలు బయటకు వొచ్చి నిలబడ్డాడు. అప్పటికే అరుణ రిక్షా పిలచి బేరమాడి, లిల్లీ నెత్తుకుని కూర్చున్నది. గేట్లోకి వచ్చి నించున్న రాంసింగుని చూసి స్నేహపూర్వకంగా నవ్వింది అరుణ. ఆమె వొడిలో వొదిగి కూర్చున్న లిల్లీ రాంసింగుని చూసి భయంగా అరుణ గుండెల్లో ముఖం దాచుకుంది. రావసింగు అయిదునిమిషాలసేపు సాగిపోయే రిక్షావెంపు చూసి హాలులోనికి నడిచాడు. ‘యాపిల్ పళ్ళ’ల్లాంటి లిల్లీ బుగ్గలమీద చారికలు కట్టున్న స్ఫటికాల్లాంటి కన్నీళ్ళని రాంసింగు మర్చిపోలేకపోయాడు. లిల్లీ బుగ్గలమీది కన్నీళ్ళతోపాటు ప్రశాంతవదనంతో పొడుగ్గా, పచ్చగా, ఆరోగ్యంతో నవనవలాడుతున్న అరుణ కూడా ఎంతవద్దనుకున్నా పదేపదేగా గుర్తువస్తున్నది. కొన్నివారాలు

గడిచాయి. ప్రతీ ఆదివారం అరుణ మళ్లి వస్తుందేమో! చూసి మాట్లాడించి స్నేహం చేసుకుందామనే సంకల్పంతో 'మాట్నీ'లకి వచ్చేవాడు. కాని అరుణ మటుకు రాలేదు. నిరీక్షణ అంతుదొరకని నిరాశని మాత్రం మిగిల్చింది. రాంసింగుకి ఆ నిరాశలో నుండగానే మామూలుగా ఒకరోజు సాయంత్రం అనుకోకుండగానే 'పార్కు'లో కనిపించింది అరుణ. పెరాంబులేటర్‌లో లిల్లీని, ఇంకో రెండేళ్ళ పాపనీ కూర్చోపెట్టుకుని త్రోసుకవస్తోంది అరుణ. లిల్లీని చూడగానే రాంసింగుకి చటుక్కున ఆరోజు భీతాంగముతో కంపించిపోయిన దృశ్యం జ్ఞప్తికి వచ్చింది. వెంటనే రాంసింగు బయటకుపోయి గుప్పెడు పిప్పరమెంట్లు కొనుక్కుని జేబులో పోసుకొనివచ్చాడు. ఎల్లాగ అయినా 'లిల్లీని' మంచిచేసుకోవాలనివుంది అతనికి. అరుణ పెరాంబులేటర్‌ని ఒక చెట్టుక్రింద నిలిపింది. రాంసింగు అటు ప్రక్కగా వచ్చాడు. అరుణ పరిచయపూర్వకంగా నవ్వింది.

"క్షమించండి! ఆ రోజు నానించి మీరు పిక్చర్ చూడకుండగా వెళ్ళిపోవాల్సి వచ్చింది!" అన్నాడు ప్రాధేయతగా ? ఇంగ్లీష్‌లో.

'ఫరవాలేదులెండి. అసలు లిల్లీ చాలా చురుకైన పిల్ల! ఆ రోజు ఎందుకని అల్లాగొడవ చేసిందో నాకర్థం కాలేదు అన్నది అరుణ.

అప్పట్నుంచీ మీరు కనపడతారేమో అని వెతుకుతూనే వున్నాను అన్నాడు రాంసింగు. ఆప్యాయత ధ్వనించిఁది ఆతని గొంతు.

'నేను మళ్ళీ థియేటర్‌కి రాలేను." అంది అరుణ. ఇద్దరూ చాలాసేపు స్నేహంగా మాట్లానుకున్నారు. వాళ్ళ సంభాషణ చాలామట్టుకు ఇంగ్లీషులోనూ, కొంచెం హిందీలోనూ జరిగింది. పెరాంబులేటర్‌లో కూర్చున్న లిల్లీ రాంసింగు వెంపు కళ్ళు పెద్దవిచేసి చూసింది.

'చూసారా! మీలిల్లీ మళ్లీ బిక్క-గా చూస్తోంది నా వెంపు!' అన్నాడు రాంసింగు.

దాని భయమెంతసేపు?' అని లిల్లీని ఎత్తుకుని ముద్దు పెట్టుకుంది అరుణ. లిల్లీ అరుణ భుజాలమీదుగా రాంసింగు వెంపు భయం భయంగా చూసింది. చప్పున రాంసింగు తను కొని దాచిన పిప్పరమెంట్లని లిల్లీ గుప్పెట్లోపోసి గుప్పెట మూసాడు. అరుణ లిల్లీని గట్టిగా హృదయానికి హత్తుకుంటూ,

'చూడు లిల్లీ! మామ ఎంతమంచివారో చూడు! తీసుకో ఈ బిళ్ళలన్నిసికే!" అని మురిపించింది.

లిల్లి తనగుప్పెట్లోవున్న బిళ్ళలవెంపు ఒకసారి రాంసింగువెంపు చూసింది. రాంసింగునల్లని గడ్డాం లిల్లీని కొద్దిగా బెదిరించింది. గడ్డం సొట్టలు పడుతూంటే తన బుల్లినోరు తెరచి పెదిమలు గులాబిరేకల్లా అదురుతూంటే.

'మామా!' అంది. అశ్చర్యంగా లిల్లీ.

'అవును! లిల్లి! మామయ్యమ్మా! మంచివారు తీసుకో! అన్నది అరుణ. 'మరి బుల్లికో! అంది ప్రస్నార్థకంగా.

'బుల్లికి' నువ్వే కాసిని ఇయ్యి!' అంది అరుణ.

'మామేనా ! మళ్ళీ నమ్మలేనట్లుగా అంది లిల్లి భయం వల్ల రాబోయే కన్నీళ్ళతో కళ్ళు అద్దాలబిళ్ళల్లే మెరుస్తోంటే పెదాలతో చిన్నగా చెంపలు సొట్టలుపడేలా రాంసింగువెంపు చూసి నవ్వింది లిల్లీ.

అరుణా, లిల్లీ ఏం మాట్లాడుతున్నారో తెలియక పోయినా మొత్తానికి ఆ పిల్లకి తనమీద సదభిప్రాయం కలిగించింది అరుణ అని తెలుసుకున్నాడు రాంసింగు. పార్కుకి పిల్లలిద్దర్ని వెంటపెట్టుకుని ప్రతీరోజూ వచ్చేది అరుణ. రోజూ లిల్లీకి పిప్పరమెంట్లు విధిగా కొని తెచ్చేవాడు రాంసింగు. క్రమంగా లిల్లీ రాంసింగుదగ్గర బాగా మాలిమిఅయిపోయింది. "మామా ! మామా ! అంటూ రాంసింగు కనపడగానే అతని దగ్గరకు పోయి కాళ్ళకి చుట్టేసుకొనేది. రాంసింగు ఎత్తుకోగానే అతని జేబులు వెతుక్కునేది. ఒక్కోసారి రాంసింగు పిప్పరమెంట్లు కొనికూడా, 'తమాషా'కి కావాలనే దాచివేసేవాడు. అవి ఇచ్చేదాకా ఒకటేగొడవ చేసేది.

"మీకీ ఇద్దరు పిల్లలేనా? మీ మిష్టర్ ఏంచేస్తున్నారు?" అని అరుణని అడిగేడు ఒకసారి రాంసింగు. దానికి జవాబేం చెప్పాలో్న తోచలేదు అరుణకి. సిగ్గుగా నవ్వి తల వొంచుకుంది. రాంసింగు ముగ్ధుడైపోయాడు. ఎంత లజ్జావతి ? తెలుగుయువతులు అంత తేలిగ్గా భర్తల పేర్లు ఉచ్చరించరని అతను విన్నాడు. అది అనుభవమయ్యింది అరుణవల్ల! ఒకటి

రెండు రోజులు అరుణ రాకుండగా వుంటం ఆరోజు రాంసింగు ఏదో నిక్షిప్తాన్ని పోగొట్టుకున్నట్లు ఫీలవటం ఆశ్చర్యకరంగా తోచేది. అతని అంతరంగంలోని నిర్మల స్నేహాకిన్నెర పావన గంగా ప్రవంతిలా అరుణ మనస్సువెంపు అదో ముఖంగా ప్రవహించుతోంది.

"ఇవ్వాళా రాలేదు. ఎంచేతనో!"

మళ్ళీ అనుకున్నాడు రాంసింగు. వారంరోజు లయి పోయింది. ఒకరోజు, రెండురోజులు అరుణ రాకపోవటం ఇది వరలో అలవాటు అయినా, ఏకంగా వారంరోజులు కనపడక పోవటం వాళ్ళ స్నేహాభివృద్ధి అయ్యేక ఇదే మొదటిసారి.

'మూడు నెల్ల పరిచయంలోనూ, వాళ్ళిళ్ళు ఎక్కడో 'కనుక్కోనేలేదు' అనుకున్నాడు రాంసింగు. ప్రతిరోజూ వాళ్ళి ద్దరూ గంటలతరబడి మాట్లాడుతున్నారు. వాళ్ళసంభాషణలో చూసిన సినిమాలూ, చూడాల్సిన సినిమాలూ, పార్కులో వింతవింత వాసనలని వెదజల్లే రంగురంగుల పూవులూ, అక్క డికి వచ్చే స్త్రీల అలంకరణలూ, లిల్లీ అల్లరితనం మొదలయిన విషయాలు తప్ప. వ్యక్తిగతవిషయాలు దొర్లేవికావు. అరుణ ఎన్నిసార్లుగానో అడగాలనుకుంది. 'మీ శ్రీమతిని తీసుకు రారేమని!' కాని, అతను తన భర్తా పిల్లలూ, విషయం అడిగి నప్పుడు తనేమీ చెప్పలేకుండగా వూరుకోవటం, అతను తన్ని మళ్ళీ మళ్ళీ ఆ జవాబు చెప్పని ప్రశంస తెచ్చి వేధించక పోవటంవల్ల అరుణ ప్రశ్న అరుణ హృదయంలోంచి వెలుపలికి రాలేకపోయింది. అతను తనపట్ల దయతో వదిలేసిన 'టాపిక్'ని

తను అతనిపట్ల నిర్దయిగాఆటాపిక్ నిఎట్లాఅడుగుతుందీ? అయినా ఇంటిదగ్గర సంసారపు జంజాటం లేనివాడయితే రోజూ ఠంచ
ే గా ఎనిమిదయ్యేసరికి ఇంటికి వెళ్ళిపోవాలంటూ ఎందుకని వెళ్ళిపోతాడు? అరుణ తనప్రశ్నలకి తనే జవాబు చెప్పుకునేది.

రాంసింగు వెళ్ళిపోవటానికి లేచాడు. వాచీ చూసు కున్నాడు ఏడున్నర అయింది. ఒక్కసారి మిగిలిన అర్థగంట కూడా వెయిట్ చెద్దామా? అనుకున్నాడు. కాని అందరూ ఇళ్ళకు వెళ్ళేవేళ, అరుణ వస్తుందా? ఒకవేళ అరుణకి ఏదన్నా అనారోగ్యం చేసిందేమో? ఛీ ఛీ! ఎంతతప్పు? అన్నీ పాడు ఆలోచనలు! బహుశా వాళ్ళకి ఏదన్నా వూరు ట్రాన్స్ఫర్ అయ్యిందేమో! తనతో మాటకన్నా చెప్పకుండా వుంటుందా? అసలు వాళ్ళ ఆయనకి ఏమి వుద్యోగమో, అదీ తెలియదే! అడుగుతే ఆరోజు ఎంతగా సిగ్గుపడిపోయిందీ! ఎంత వద్దను కున్నా లజ్జతో కందిపోయి, వంగిపోయిన ఆఅరుణ పద్మంలాంటి అరుణ ముఖం తన స్మృతి పథంలోంచి విస్మృతి కావటం లేదు. ఏనాటిదీ అనుబంధం? ఎందుకీ మమకారం?

రాంసింగు. నిర్వేధంగా తల వంచుకుని నాలుగు అడు గులు నడిచాడు, వెనుక వెంపునించి పరిచితమైన చిన్నారిచిట్టి చేతులు రాంసింగు కాళ్ళని బలంగా చుట్టివేశాయ్!

'మామా!' అంటూ లిల్లీ సాక్షాత్కరించింది. రాంసింగు ఒక్కవుదుటున లిల్లీని రెండుచేతులతో పైకెత్తి గాఢంగా హృదయానికి హత్తుకున్నాడు. లిల్లీ చిట్టిచేతులు రాంసింగు షర్టు జేబులు వెతుకున్నాయి. లిల్లీ చేతులనిండుగా

పిప్పరమెంట్లుబిళ్ళలు వచ్చాయి. ఒక్కబిళ్ళన్నా మిగలకుండగా లిల్లి ఆ బిళ్ళలనీ పదిలంగా తన గౌను జేబులో పోసుకుంది. లిల్లికి రాంసింగు తనతో మాట్లాడ లేదని తెలుసును. తను ఏదన్నా చెప్పినా మామ వుత్తినే నవ్వుతూ వుంటాడనీ గుర్తుంది. ఇంకా ఎక్కువగా తను మాట్లాడుతూంటే ఆ మీసాలు గుచ్చుకుంటూండగా, తనబుగ్గలు రెండూ గట్టిగా ముద్దుపెద్దుకుంటాడు. అయినా 'లిల్లి' ఇప్పుడు పెద్దకర్తవ్యం తన నెత్తిన పెట్టుకుని వచ్చింది. అంచేత మామ 'మాట్లాడకుండా నవ్వినా, మీసాలు గుచ్చుకునేలా, ముద్దులు పెట్టినా, లిల్లి మాట్లాడకుండగా ఎల్లావుంటుందీ?

'మామా! మామా! నాన్నవత్తాడు!" అంది లిల్లి ముద్దుగా. రాంసింగు ఆ నెమ్మదిగా కదలేలేగులాబీ రేకల పెదాలని మీసాలు గుచ్చుకునేలా గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. ఇంతలో ఒక పాంటు, బుష్షర్టు వేసుకున్న ఒకవ్యక్తి రాంసింగువద్దకు వచ్చి, నిలబడ్డాడు.

'మీరేనా రాంసింగు! ఇంగ్లీషులో అడిగాడు ఆవ్యక్తి. 'అవును' రాంసింగు జవాబుచెప్పి ఆ వ్యక్తికేసి విస్మితంగా చూసాడు' 'లిల్లి' రాంసింగు చేతుల్లోంచి క్రిందకి జారి ఆవ్యక్తిదగ్గరకెళ్ళి నించుంది. ఆవ్యక్తి ఒక ఇన్విటేషన్ కవరు తీసి, రాంసింగుకి ఇచ్చి,

నేను, అరుణ, అన్నయ్యాని! రేపురాత్రి మాచెల్లికి పెళ్ళి మిమ్మల్ని పిలవాలని చెప్పింది. కాని మీ ఇంటిఅడ్రస్

తనకూ తెలియదట. పార్కుకు వస్తారనీ లిల్లి ఆనవాలు పట్టకలదనీ చెప్పింది. మీ ఇల్లు తెలియక మీ ఇంటికి రాలేక పోయాము. మీరు తప్పకుండా మీ ఫామిలీతో సహా రేపు రాత్రి పెళ్ళికీ, ఎల్లుండి డిన్నరుకీ రండి. అరుణ మీకోసం ఎదురుచూస్తూ వుంటుంది. ఈ ప్రక్క సందులో, పెద్ద పందిరి వేసి షామియానా, కట్టినదే మాఇల్లు" అన్నాడు.

'తప్పక వస్తాను' అన్నాడు రాంసింగు.

'మీ ఫామిలీని కూడా తీసుకరండి' అన్నాడు అరుణ అన్నయ్య.

అల్లాగే' శుష్కంగా నవ్వాడు రాంసింగు.

'తప్పక రామామా !' అంది లిల్లి. రాంసింగు తల వూపాడు. ఇంటికి వెళ్ళినాక. ఇన్విటేషన్ కార్డు చదువుకున్నాడు 'అరుణ బి.ఎ. శాస్త్రి బి.ఇ'అన్నివున్న వధూవరుల క్వాలిఫికేషన్సని, మననంచేసుకున్నాడు.అరుణ ఇన్నిరోజులూ అవివాహిత అన్నమాట ! ఆరోజున' మీ మిష్టర్ ఏమిచేస్తున్నారని తాను అడిగినప్పుడు గులాబీ మొగ్గలా ముడుచుకుపోయిన అరుణని చూచి, ఆంధ్రస్త్రీలకి ఎంత లజ్జ ! అనుకున్నాడు. కాని అవివాహిత అని తాను ఎందుకని గ్రహించలేకపోయాడు ? గ్రహించ కలిగివుంటే ఏమయ్యేది ! భగవాన్ ! ఇప్పుడు తెలిసింది. అరుణని తను ! తను అరుణని ! రాంసింగు కళ్ళమ్మట నీళ్ళు నిశ్శబ్దంగా ఊరుతున్నాయి. అరుణని అఖరుసారిగా చూడాలి ఏది ఏమయినా, అరుణ సున్నితమైన మందహాసాన్ని తనది ఎప్పటికీకాని ఆ 'మృదుస్మితి'ని

తన హృదయఫలకంమీద శాశ్వతంగా ముద్ర వేసుకుందుకు తను అరుణని ఒక్కసారి ఒక్కసారైన చూడాలి !

రాంసింగు మర్నాడు సాయంత్రం అరుణ ఎప్పుడూ ధరించే లేతగులాబీరంగులో దోసెడు వెడల్పు జరీఅంచు వున్న వోక వెంకటగిరి చీర, తెల్లని చికెన్ వాయిల్ బ్లౌజుపీసూ కొని అరుణ ఇంటికి వెళ్ళాడు. అరుణ వాళ్ళ అన్నయ్యా వొదినా, ఎంతో ఆదరంగా ఆహ్వానించారు. వాళ్ళ మానసికసంస్కారానికి ముగ్ధుడైపోయాడు రాంసింగు. బంగారపుచాయ పట్టుచీరలో గులాబీరంగు బుగ్గమీద నయాపైసంత కాటుక బొట్టుతో మిసమిసమెరిసే పుత్తడిబొమ్మ అరుణ వచ్చి రాంసింగు ఇచ్చిన కానుకని అందుకుంది.

'మీరొక్కరే వచ్చారా ! కళ్ళు పెద్దవిచేసి అడిగింది.

'నేనొక్కణ్ని కాక ఇంకా ఎవర్ని వెంటపెట్టుకునిరమ్మంటారు ?' అన్నాడు రాంసింగు.

మీ శ్రీమతిని ఆమె పెదాలమీద మృదుమందహాసం తళుక్కుమంది.

రాంసింగు నవ్వి వూరుకున్నాడు. అరుణ అరుణ అన్నయ్యా వొదినా అతన్ని మర్నాడు డిన్నర్‌కి రాత్రి ముహూర్తానికీ వుండమని బ్రతిమాలారు కాని రాంసింగు.

'రాత్రి నేను నిద్రలేకుండగా వుండలేను. రేపు డిన్నర్‌కి తప్పకవస్తాను' అన్నాడు. వెళ్లిపోతూ. అరుణని 'మామా !' అంటే ఏమిటి' అని అడిగాడు. అరుణ' మీకు తెలియదా! తల్లి

సోదరున్నికానీ, మేనత్త భర్తనికానీ 'మామా' అంటారు. అంది.

'ఆహా !' ఆశ్చర్యంగా అరుణకేసి చూసి,

'వస్తా. విష్‌యూ గుడ్‌లక్' అని గబగబా నడిచి వెళ్లిపోయాడు రాంసింగు.

ఆ మర్నాడు 'డిన్నర్‌కి' రాంసింగు రాలేదు. తర్వాతెప్పుడూ అరుణకి కనపడలేదు. అరుణ భర్త అరుణని ఒకసారి అడిగాడు.

'ఏమోయ్ ! మీ పంజాబీఫ్రెండ్ మళ్ళీ కనబడనేలేదేం ?

'నాకు తెలియదండీ ఒకవేళ ట్రాన్స్ఫర్ అయిందేమో!' అన్నది మామూలుగా.

"నాకు తెలుసోయ్ ! మన పెళ్ళి అయిన మర్నాడే అతను వుద్యోగానికి రిజైన్ చేసి వెళ్లిపోయాట్ట ! అందుకే డిన్నర్ 'పార్టీ'కి కూడా రాలేదు అన్నాడు.

'అంతకన్నా మంచివుద్యోగం దొరికిందేమో!' అన్నది అరుణ. కాదుకాదు. అతను ఎవర్నో ప్రేమించాట్ట! ఆ ప్రేమ విఫలమయిందట ! అందుకని వెళ్ళిపోయాట్ట ! అక్కడ్నే వర్కు చేస్తోన్న మా 'రావు' చెప్పాడు అన్నాడు శాస్త్రి.

'ఎవరన్నా రామాట ? మీరావుగారా ! ఆయన ఒకరోమియో అనా ?' అందర్నీ అంటాడు ? మతి లేకపోతేసరి ! ఆయ

నకి ప్రేమేమిటి ? భార్య వేచివుంటుందని ఎక్కడవున్నా ఎనిమి దింటికల్లా ఇంటికి వెళ్ళిపోయేవాడు. ఎప్పుడూ పిల్లలకోసం ఇన్ని బిళ్ళలు కొని జేబులో పోసుకొని వుంచుకునేవాడు !" పైకి బింకంగా అంది అరుణ. కాని ఆమె మనస్సు ఏదో అనిర్ది ష్టితవ్యథతో గిజగిజలాడింది. అప్పట్నించీ ఆమెకళ్ళు పదిమంది కనపడ్డచోటా, సినిమాహాల్సులోనూ, పార్కుల్లోనూ, రాంసింగుకోసం వెతుకుతూనే వున్నాయి. కాని రాంసింగు ఎక్కడా, ఎప్పుడూ కనపడటంలేదు—

* * *

# స్వయంబద్ధ నిర్మల

"నిజంచెప్పు !"

మళ్లీ గర్జించాడు రాజుబాబు. నిర్మల మాట్లాడలేదు. మౌనంగా తలవంచుకుంది. మౌనం అర్ధాంగీకారం అవుతుందని నిర్మలకి తెలియందికాదు. అర్ధాంగీకారం తన ఆత్మకి పూర్ణాం గీకార మవుతుందనీ తెలుసును. అందుకనే నిర్మల ఏమీ మాట్లాడకుండా మౌనం వహించింది. ఆమౌనం రాజుబాబులో నిద్రాణమై వున్న అహంకారాన్ని రెట్టింపు చేసింది.

'పోనీ ! రోజల్లా ఒకర్తివీ ఒంటిగా కూర్చుని ఏడవ్వాలి కదా అని వ్రాసుకోమంటే ఇదా నీ నిర్వాకం ! నీ కథల్లోకి ఎక్కించటానికి మాఫామిలీయే దొరికిందా ! మాఫామిలీయే